సంపన్నులపై పన్నులు పెంచండి

ఆర్థిక అసమానతలు తగ్గేందుకు ఇదే మార్గం

భారత్‌కు ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెట్టి సూచన

న్యూఢిల్లీ: భారత్‌లో ఆర్థిక అసమానతలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ధనవంతులపై ఎక్కువ పన్నులు విధించాలని ఫ్రెంచ్ ఆర్థికవేత్త, 'కాపిటల్ ఇన్ ది ట్వెంటీ ఫస్ట్ సెంచరీ' పుస్తక రచయిత థామస్ పికెట్టి సూచించారు. రీసెర్చ్ అండ్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలోని రూ.10 కోట్ల కంటే ఎక్కువ ఆస్తులు ఉన్న సంపన్నులపై 2 శాతం సంపద పన్ను విధిస్తే దేశ జీడీపీలో 2.73 శాతానికి సమానమైన వార్షిక ఆదాయం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రూ.10 కోట్ల పైన విలువైన ఆస్తులపై 33 శాతం వారసత్వ పన్నును కూడా విధించాలని ఆయన సూచించారు. 2022-23లో జాతీయ ఆదాయంలో 22.6 శాతం వాటా దేశంలోని అత్యంత సంపన్నులైన 1 శాతం జనాభాదేనని, దేశం మొత్తం సంపదలో 40.1 శాతం వారి వద్దే ఉందని ఆయన పేర్కొన్నారు. భారతదేశ జాతీయ ఆదాయంలో అత్యంత ధనికులైన 1 శాతం మంది వాటా విలువ అమెరికా, బ్రెజిల్‌లలోని 1% ధనికుల వాటాను మించిపోయిందని ఆయన అన్నారు. అయితే, పికెట్టి సూచనను ఇదే కార్యక్రమంలో పాల్గొన్న భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ వ్యతిరేకించారు. కాగా, భారత ప్రభుత్వం 2015లో సంపద పన్నును రద్దు చేసింది. వారసత్వ పన్నును తీసుకురావాలనే ప్రతిపాదనలను ప్రభుత్వం తిరస్కరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పన్ను విధించబోమని ఏప్రిల్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

కెనడా ఆదేశం.. భారత విద్యార్థుల్లో భయం

- కీలక పత్రాల సమర్పణకు ఇమిగ్రేషన్ శాఖ ఆదేశాలు
- వీసా గడువు ఉన్నప్పటికీ విదేశీ విద్యార్థుల్లో కలవరం

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: తమ కీలకమైన పత్రాలను మరోసారి సమర్పించాలని అధికారులు ఆదేశించడంతో కెనడాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. తమ స్టడీ పర్మిట్లు, వీసాలు, మార్కులు, హాజరు సహా విద్యాపరమైన రికార్డులను సమర్పించాలని ఇమిగ్రేషన్, రిఫ్యూజీస్ అండ్ సిటిజెన్‌షిప్ కెనడా(ఐఆర్‌సీసీ) నుంచి అనేక మంది విద్యార్థులకు ఈ-మెయిల్స్ అందాయి. రెండేళ్ల గడువుతో వీసాలు ఉన్న చాలా మంది విద్యార్థులకు ఈ ఈ-మెయిల్స్ గుబులు రేపినట్లు మీడియా కథనాలు వెలువడ్డాయి. అంతర్జాతీయ విద్యార్థుల రాకను క్రమబద్ధం చేసేందుకు ఎన్‌డిఎస్ పేరిట తన ఫాస్ట్ ట్రాక్ స్టడీ వీసా ప్రోగ్రామ్‌ను ఐఆర్‌సీసీ ముగించిన తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు అవసరమైన అర్హతలను కూడా కొద్దిగా కఠినతరం చేయనున్నట్లు కెనడా అప్పటికే ప్రకించింది. గతవారం కూడా ఇటువంటి పరిణామాలు కొన్ని చోటుచేసుకున్నాయి. పంజాబ్‌కు చెందిన విద్యార్థులకు కూడా ఈ తరహా ఈ-మెయిల్స్ అందాయి. తమ గుర్తింపును నిరూపించుకునేందుకు ఐఆర్‌సీసీ కార్యాలయాన్ని సందర్శించాలని కూడా వారికి ఆదేశాలు వెళ్లాయి. తాజా పరిణామాల పట్ల భారతీయ విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా, కెనడా ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ అక్టోబర్ 24న తమ కొత్త ఇమిగ్రేషన్ వ్యూహాన్ని వివరిస్తూ 2025లో కెనడా సుమారు 3.95 లక్షల మందిని పర్మనెంట్ రెసిడెంట్స్‌గా చేర్చుకుంటుందని చెప్పారు. ఈ ఏడాది 4.85 లక్షల మందిని చేర్చుకుంటారని అంచనా ఉండగా ఆయన లెక్క ప్రకారం 20 శాతం తగ్గే అవకాశం ఉంది.

బంతుల వేటతో కాసుల మూట

నెలకు లక్షన్నర సంపాదిస్తున్న మలేషియన్

గోల్ఫ్ కోర్టుల్లో బాల్స్ వెతికివ్వడమే పని

నీటి కుంటల్లో పడిన గోల్ఫ్ బంతులను వెతికి తీసుకొస్తున్న సుమది ఇబ్రహీం

కౌలాలంపూర్, డిసెంబర్ 14: ఒళ్లొంచి పని చేసే తత్వం ఉండాలే కానీ చేసుకునేందుకు ఈ భూమి మీద రకరకాల వృత్తులు ఉన్నాయి. ఇందులో ఒకటి 'గోల్ఫ్ బాల్ డైవింగ్'. అరుదైన ఈ వృత్తిని ఎంచుకొని నెలకు లక్షన్నర రూపాయలకు పైగా సంపాదిస్తున్నాడో మలేషియన్. సుమది ఇబ్రహీం(51) అనే వ్యక్తి 22 ఏండ్ల పాటు మలేషియా నౌకాదళంలో పని చేశాడు. పదవీ విరమణ తర్వాత కుటుంబానికి భారం కాకుండా ఉండేందుకు ఏదైనా పని చేయాలనుకున్నాడు. కానీ, ఈత కొట్టడం మినహా ఆయనకు ఇతర నైపుణ్యాలేవీ పెద్దగా లేవు. ఈ సమయంలో స్నేహితుల ద్వారా ఇబ్రహీంకు ఈ గోల్ఫ్ బాల్ డైవింగ్ పని గురించి తెలిసింది. గోల్ఫ్ ఆడేటప్పుడు చాలా బంతులు నీటి కుంటల్లో పడిపోతుంటాయి. ఈ బంతులను వెతికి పట్టుకోవడమే గోల్ఫ్ బాల్ డైవింగ్. కౌలాలంపూర్‌లోని ఓ గోల్ఫ్ కోర్టులో ప్రతి రోజూ రాత్రిపూట ఇబ్రహీం నీటి కుంటల్లోకి దిగి బంతులు వెతికితీస్తాడు. వీటిని శుభ్రం చేసి, తెల్లవారి అక్కడే గోల్ఫ్ ఆడే క్రీడాకారులకు విక్రయిస్తుంటాడు. పదేండ్ల నుంచి ఆయనది ఇదే పని. ఈ పని చేయడం ద్వారా తనకు నెలకు లక్షన్నర వరకు సంపాదన ఉందని ఇబ్రహీం చెప్తున్నాడు. ప్లాస్టిక్, రబ్బర్‌తో కలిపి చేసే బంతులు నీటి కుంటల్లో పడిపోవడం పర్యావరణానికి హానికరం. వాటిని వెతికితీయడం ద్వారా ఇబ్రహీం పరోక్షంగా పర్యావరణానికి సైతం మేలు చేస్తున్నాడు.

జమిలిపై కేంద్రం దూకుడు

16న పార్లమెంట్‌లో బిల్లు ■ అభివృద్ధికి ఆటంకమని విపక్షాల విమర్శ

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: ఒకే దేశం-ఒకే ఎన్నిక నినాదంతో దేశంలోని పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ఒకే విడత ఎన్నికలు నిర్వహించేందుకు అవకాశం కల్పించే జమిలి ఎన్నికలపై కేంద్రం దూకుడుగా ముందడుగు వేస్తున్నది. జమిలి బిల్లులను కేంద్రం సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. వీటికి సంబంధించిన రెండు బిల్లులకు గురువారమే కేంద్ర మంత్రివర్గం ఆమోదించగా, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ వీటిని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లుకు సంబంధించిన ప్రతులను శుక్రవారం సాయంత్రం ఎంపీలకు అందజేశారు. ముసాయిదా బిల్లుల ప్రకారం సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ మొదటి సమావేశానికి రాష్ట్రపతి నోటిఫై చేసిన తేదీ నుంచి ఏకకాల ఎన్నికలు అమలులోకి వస్తాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం ఈ నియమిత తేదీ తర్వాత ఎన్నికైన అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలాలు, లోక్‌సభ పూర్తికాల వ్యవధితో పాటు ముగిసేలా తగ్గిస్తారు. తద్వారా ఏకకాల ఎన్నికలకు మార్గం సుగమమవుతుంది. 2024 లోక్‌సభకు సంబంధించి మొదటి సమావేశం ముగిసిందున తదుపరి లోక్‌సభ ఎన్నికలు 2029లో జరుగుతాయి. ఆ లోక్‌సభ మొదటి సమావేశంలో రాష్ట్రపతి నోటిఫై చేస్తే ఆ లోక్‌సభ పూర్తి పదవీ కాలం ఉంటే 2034లో తొలి విడత జమిలీ ఎన్నికలు జరుగుతాయి. ఈ బిల్లు ప్రకారం అసెంబ్లీలకు ఉన్న నిబంధనలే కేంద్ర పాలిత ప్రాంతాలపైన ఢిల్లీ, జమ్ము కశ్మీర్, పుదుచ్చేరిలకు కూడా వర్తిస్తాయి. ఈ కొత్త జమిలి ఎన్నికల బిల్లు ప్రకారం నిర్దేశిత కాల పరిమితి కన్నా ముందే పార్లమెంట్, రాష్ట్ర, యూటీల అసెంబ్లీలు రద్దయితే, ఆయా అసెంబ్లీలకు, పార్లమెంట్‌కు మిగిలి ఉన్న కాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నికలు జరుగుతాయి.

సమస్యల నుంచి పక్క దారి పట్టించడానికే

'దేశంలోని నిరుద్యోగం. ద్రవ్యోల్బణం లాంటి ప్రధాన సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే కేంద్రం జమిలి ఎన్నికల పాట పాడుతున్నది. ఇది ప్రజలను కలవర పరిచే ఆయుధం. సమస్యలను పక్కదారి పట్టించే అంశం' అని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ విమర్శించారు. జమిలి ఎన్నికలు నిర్వహిస్తే 77 శాతం ఓటర్లు కేంద్రం, రాష్ట్రంలో ఒకే పార్టీని ఎన్నుకునే అవకాశం ఉందని ఐడీఎఫ్‌సీ ఇనిస్టిట్యూట్ చేసిన సర్వే పేర్కొందని అన్నారు. క్రూరమైన దంతాలు, గోళ్లతో కబళించడానికి సిద్ధంగా ఉన్న ఈ బిల్లును పార్లమెంట్‌లో తమ పార్టీ ఎంపీలు వ్యతిరేకిస్తారని టీఎంసీ చీఫ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

దేశ సమాఖ్య నిర్మాణానికి హాని

ఈ జమిలి ఎన్నికల బిల్లు 'భారత దేశం ఆలోచన' స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, ఇది దేశ సమాఖ్య నిర్మాణానికి హాని కలిగిస్తుందని సీపీఐ(ఎం) నేత ఎంవై తరిగామి పేర్కొన్నారు. ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని అన్ని పార్టీల వారు వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఇప్పటికే ఒకే దేశం-ఒకే పన్ను విధానం పేరిట వసూలు చేస్తున్న లక్షలాది కోట్ల రూపాయలను కేంద్రం తన వద్ద ఉంచుకుంటున్నది. తమ వాటా కోసం రాష్ట్రాలు వారిని దేహీ అని వేడుకోవాల్సిన దుస్థితి నెలకొందని విమర్శించారు. భారత దేశ పునాదుల పటిష్ఠత భిన్నత్వంలో ఏకత్వంపై ఆధారపడి ఉందని, దానికి భంగం కలిగించడానికే కేంద్రం చేసే ఏ ప్రయత్నమైనా దేశానికి హాని కలిగిస్తుందని అన్నారు.

ఏక కాల ఎన్నికలతో అభివృద్ధికి బ్రేక్

జమిలి ఎన్నికల వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందని కేంద్రం ప్రకటిస్తున్నా, దానిపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశమంతా ఏక కాలంలో ఎన్నికలు జరగడంతో ఎన్నికల నియమావళి అమలులోకి వస్తుందని, దాంతో దేశమంతటా అభివృద్ధి పనులు, ముఖ్యమైన అంశాలపై విధాన నిర్ణయాలు ఆగిపోతాయని ఇది ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని విమర్శలు వస్తున్నాయి. దేశమంతా జరిగే ఎన్నికలకు సరిపడా భద్రతా సిబ్బంది ఉండరని, దీని కారణంగా శాంతిభద్రతల సమస్య ఏర్పడుతుందని, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల విధుల్లో మునిగి తేలడం వల్ల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఒకవేళ అసెంబ్లీ, పార్లమెంట్ నిర్దేశిత గడువు కన్నా ముందే రద్దయితే మిగిలిన కాలానికి మాత్రమే ప్రజా ప్రతినిధుల పదవీ కాలం ఉండటం వారిని ఎన్నుకున్న ప్రజలను అవమానించడమే కాక, వారి హక్కును కాలరాయడమేనని వారు తెలిపారు.

ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు

6 నెలలు పొడిగింపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: ఆధార్‌ను ఉచితంగా అప్‌డేట్ చేసుకునే గడువును యూఐడీఏఐ మరో ఆరు నెలలు పొడిగించింది. వాస్తవానికి ఈ గడువు శనివారంతో ముగియగా, దానిని వచ్చే ఏడాది జూన్ 14 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. దీని కారణంగా లక్షలాది మంది పౌరులకు ప్రయోజనం చేకూరనుంది. ఆధార్‌లోని పేరు, లింగం, పుట్టిన తేదీ, చిరునామా తదితరాలను మార్చుకోవాలనుకే వారు https://myaadhaar /uidai.gov.in పోర్టల్‌లోకి వెళ్లి తమ వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చునని యూఐడీఏఐ వివరించింది.

ఢిల్లీ స్కూళ్లకు మళ్లీ బాంబు బెదిరింపులు

నేర రాజధానిగా మారిందని కేజ్రీవాల్ విమర్శ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో స్కూళ్లకు బాంబు బెదిరింపులు రావడం నిత్యకృత్యంగా మారింది. శనివారం నగరంలోని 6 స్కూళ్లకు ఈ-మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయని అగ్నిమాపక శాఖ అధికారులు మీడియాకు తెలిపారు. పోలీసులు, డాగ్ స్క్వాడ్‌లతో నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్‌లో ఎలాంటి అనుమానిత వస్తువులు లభించలేదని, బాంబు బెదిరింపులు నకిలీవిగా తేల్చారు. పాఠశాలలకు నకిలీ బాంబు బెదిరింపులు రావటం ఈవారంలో మూడోసారి. దక్షిణ ఢిల్లీలోని వసంత్ కుంజ్ ప్రాంతంలో తాను చదువుకుంటున్న స్కూల్‌కు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు పంపినందుకు ఓ విద్యార్థిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థికి కౌన్సెలింగ్ నిర్వహించి, అతడి తల్లిదండ్రులను హెచ్చరించారు. కాగా, బాంబు బెదిరింపులపై ఆప్ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ తాజాగా స్పందించారు. నగరంలో నెలకొన్న శాంతిభద్రతలపై ప్రజలంతా ఆందోళన చెందుతున్నారని, ఢిల్లీ నేరాలకు రాజధానిగా మారిందని విమర్శించారు.

హోదాను బట్టి బెయిల్ ఇవ్వలేం

మాజీ మంత్రి కేసులో సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: మంత్రి అయినంత మాత్రాన బెయిల్ మంజూరు చేసే విషయాన్ని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పశ్చిమ బెంగాల్ మాజీ మంత్రి పార్థ ఛటర్జీ బెయిల్ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం విచారించింది. 'బెయిల్‌ను తిరస్కరించడానికి నిందితుడి అధికారిక హోదా కారణం కాకూడదు. ఇదే సమయంలో బెయిల్ మంజూరు చేసేందుకు హోదాను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవడమూ కుదరదు. న్యాయబద్ధంగా విధులు నిర్వర్తించే క్రమంలో అధికారిక హోదాలు, స్థాయికి సంబంధం ఉండదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

దక్షిణ కొరియా అధ్యక్షుడికి పదవీ గండం

జాతీయ అసెంబ్లీలో ఎదురు దెబ్బ

సియోల్: దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌పై అభిశంసన తీర్మానాన్ని నేషనల్ అసెంబ్లీ 204-85 ఓట్లతో ఆమోదించింది. ఈ తీర్మానాన్ని కోర్టు 180 రోజుల్లోగా పరిశీలిస్తుంది. ఈలోగా ఆయనను పదవిలో కొనసాగించాలా? వద్దా? అనే అంశంపై న్యాయస్థానం ఆదేశాలు ఇస్తుంది. ఆయనను పదవి నుంచి తొలగించాలని ఆదేశిస్తే, 60 రోజుల్లోగా ఎన్నికలు జరగాలి. ఈ నేపథ్యంలో ఆయన అధికారాలను తగ్గించే అవకాశాలు కూడా ఉన్నట్లు మీడియా చెబుతున్నది. యూన్ సుక్ యోల్ ఇటీవల మార్షల్ లా విధించడంతో ఆయనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

రాజ్యాంగ రూపకల్పనలో ఆర్ఎస్ఎస్ పాత్రేంటి?

దాని అమలుపై అధికార, విపక్షాల పరస్పర విమర్శలు

న్యూఢిల్లీ: భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవాల సందర్భంగా లోక్‌సభలో రెండో రోజు శనివారం కూడా వాడి వేడి చర్చ జరిగింది. డీఎంకే ఎంపీ ఏ రాజా మాట్లాడుతూ.. రాజ్యాంగ ప్రవేశికలో లౌకికవాదం, సామ్యవాదం పదాలను చేర్చి ఉండకపోతే, బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేసి ఉండేదని ఆరోపించారు. రాజ్యాంగ రూపకల్పనలో ఆరెస్సెస్, హిందూ మహా సభ పాత్ర ఏమిటో చెప్పాలని అన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో భారతీయత లేదని సావర్కర్ అన్నారని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడం గురించి మాట్లాడుతున్న బీజేపీ తన సుప్రీం లీడర్‌ను అవమానిస్తున్నదని వ్యాఖ్యానించారు.

దేశ ఐక్యతకు ఆధారం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ చర్చకు బదులిస్తూ, భారత దేశ ప్రాచీన ప్రజాస్వామిక మూలాలు ప్రపంచానికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. మన ఐక్యతకు ప్రాతిపదిక మన రాజ్యాంగమేనన్నారు. నెహ్రూ కుటుంబం రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచనకు బీజం వేసిందని ఆరోపించారు.

వీసా సంస్కరణలతో విదేశీ విద్యార్థులు తగ్గారు

యూకేపై ప్రతికూల ప్రభావం

లండన్, డిసెంబర్ 14: యూకేలో చేపట్టిన వీసా సంస్కరణలు ఆ దేశానికి వచ్చే వారిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ఆ దేశానికి వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టినట్టు ఆఫీస్ ఫర్ నేషనల్ స్టాటిస్టిక్స్ (ఓఎన్ఎస్) తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వీసాలు తగ్గడానికి ప్రధాన కారణం గతంలో లాగా యూకేలో స్థిరపడే అవకాశాలు విద్యార్థులకు తగ్గడమేనని ఇమిగ్రేషన్ నిపుణులు చెబుతున్నారు. 2024 నాటికి ముగిసే ఏడాదిలో 1.2 మిలియన్ల మంది యూకేకు వలస వచ్చారు. 2023 అక్టోబర్ నుంచి 2024 సెప్టెంబర్ వరకు విద్యార్థి వీసాల సంఖ్య 19 శాతం, డిపెండెంట్ల వీసాల సంఖ్యలో 69 శాతం తగ్గుదల నమోదైంది. ఈ ప్రభావం బ్రిటన్‌లోని యూనివర్సిటీలపై కూడా పడింది.

పాదయాత్ర చేస్తున్న రైతులపైకి టియర్‌గ్యాస్ ప్రయోగించిన పోలీసులు

రైతుల పైకి టియర్ గ్యాస్

- హర్యానా పోలీసులు రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించారన్న కర్షకులు
- రైతుల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించడంలో ప్రతిపక్షాలు సైతం విఫలమయ్యాయని విమర్శ
- తాత్కాలికంగా ఢిల్లీ యాత్ర నిలిపివేత

శంభూ, డిసెంబర్ 14:పంజాబ్, హర్యానా రాష్ట్రాల సరిహద్దుల్లోని శంభూ పాయింట్ వద్ద హర్యానా భద్రతా సిబ్బంది శనివారం రైతుల పాదయాత్రపై బాష్పవాయు గోళాలు ప్రయోగించాలి. దీంతో కొందరు రైతులు గాయపడ్డారు. ఈ కారణంగా ఢిల్లీకి చేపట్టిన పాదయాత్రను తాత్కాలికంగా నిలిపివేయాలని రెండు రైతు వేదికలు నిర్ణయించినట్లు పంజాబ్ రైతు నాయకుడు స్వరణ్ సింగ్ పంధేర్ విలేకరులకు తెలిపారు. హర్యానా పోలీసుల దూకుడు వల్ల 17-18 మంది రైతులు గాయపడ్డారని ఆయన చెప్పారు. రైతులపై భద్రతా సిబ్బంది రబ్బర్ బుల్లెట్లు పేల్చారని రైతు నాయకుడు మంజిత్ సింగ్ రాయ్ ఆరోపించారు. రబ్బర్ బుల్లెట్లు తగిలి ఒక రైతు గాయపడినట్లు ఆయన చెప్పారు. రైతులను చెదరగొట్టేందుకు రసాయనాలు కలిపిన నీళ్లను ఉపయోగించారని, ఈ రోజు మరిన్ని బాష్ప వాయు గోళాలను ప్రయోగించారని పంధేర్ తెలిపారు. అయితే ఈ ఆరోపణలను అంబాలా కంటోన్మెంట్ డీఎస్పీ రజత్ గులియా తోసిపుచ్చారు. 101 మంది రైతుల పాదయాత్ర దేశ శాంతి భద్రతలకు ఏ విధంగా ముప్పు అవుతుందని పంధేర్ ప్రశ్నించారు. దేశ రాజధాని వైపు రైతులు పాదయాత్ర చేపట్టడం ఇది మూడవసారి.

16న రైతుల ట్రాక్టర్ మార్చ్

పంజాబ్ వెలుపల డిసెంబర్ 16న ట్రాక్టర్ మార్చ్, డిసెంబర్ 18న పంజాబ్ లోపల రైల్ రోకో నిర్వహిస్తామని రైతు నాయకుడు స్వరణ్ సింగ్ పంధేర్ ప్రకటించారు. శనివారం పాదయాత్రలో గాయపడిన రైతులకు చికిత్స అందచేయడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రస్తుత శీతాకాల పార్లమెంటరీ సమావేశాలలో రైతుల సమస్యలను సమర్థవంతంగా ప్రస్తావించడంలో, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ రాహుల్ గాంధీ విఫలమయ్యారని ఆరోపించారు.

తాకట్టు లేకుండా రైతులకు 2 లక్షల రుణం

జనవరి 1 నుంచి అమలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: రైతులకు తాకట్టు లేకుండా రూ.2 లక్షల వరకు రుణాన్ని అందించే నిర్ణయాన్ని వచ్చే ఏడాది జనవరి 1 నుంచే అమలు చేయాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిర్ణయించింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా బ్యాంకులకు మార్గదర్శకాలు జారీ చేసింది. కొత్త రుణ నిబంధనల గురించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించింది. పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయిన నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతులకు రుణ సదుపాయాన్ని పెంచడం కోసం వ్యవసాయ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో 86 శాతం మంది రైతులు చిన్న, సన్నకారు వ్యవసాయదారులేనని, రుణ పరిధిని పెంచడం ద్వారా వారికి మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ పేర్కొన్నది.

అద్వానీకి ఐసీయూలో చికిత్స

నిలకడగా ఆరోగ్యం

న్యూఢిల్లీ: బీజేపీ అగ్ర నేత అద్వానీ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను ఢిల్లీలోని అపోలో హాస్పిటల్‌లో చేర్పించారు. ఆయన డాక్టర్ వివేక్ సూరి పర్యవేక్షణలో ఉన్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అపోలో వెల్లడించింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, అద్వానీని రెండు రోజుల క్రితమే ఈ దవాఖానలో చేర్పించినట్లు తెలుస్తున్నది.

ఓపెన్ ఏఐ మాజీ పరిశోధకుడి

అనుమానాస్పద మృతి

సంస్థ గుట్టు రట్టు చేసిన వ్యక్తిగా గుర్తింపు

శాన్‌ఫ్రాన్సిస్కో: ఓపెన్ ఏఐ మాజీ పరిశోధకుడు సుచిర్ బాలాజీ (26) గత నెల 26న అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయన ఓపెన్ ఏఐలో సుమారు నాలుగేండ్లు పని చేశారు. సుచిర్ స్నేహితులు, సహోద్యోగులు ఆయన ఆరోగ్య పరిస్థితి పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, శాన్ ఫ్రాన్సిస్కో పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. పోలీసులు ఆయన అపార్ట్‌మెంట్‌కు వెళ్లేటప్పటికి, ఆయన మృతదేహం కనిపించినట్లు తెలుస్తున్నది. ఆయన మరణించినట్లు నవంబరు 26న ధ్రువీకరించారు. అయితే ఈ విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. ఆయన ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని పోలీసులు చెప్తున్నారు. సుచిర్ ఆగస్టులో ఓపెన్ ఏఐకి రాజీనామా చేశారు. కొద్ది రోజుల తర్వాత ఓపెన్ ఏఐ కాపీరైట్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నదని ఆయన బయటపెట్టారు. చాట్ జీపీటీ వంటి టెక్నాలజీలు ఇంటర్నెట్‌కు నష్టం కలిగిస్తున్నాయని ఆరోపించారు. అందుకే ఆ కంపెనీకి రాజీనామా చేశానన్నారు. చాట్ జీపీటీ వంటి ఏఐ టెక్నాలజీలు ఒరిజినల్ కంటెంట్‌కు సబ్‌స్టిట్యూట్స్‌ను సృష్టిస్తాయని సుచిర్ బాలాజీ ఆందోళన వ్యక్తం చేశారు. 'న్యూయార్క్ టైమ్స్' పత్రికకు ఆయన ఇచ్చిన సుదీర్ఘ ఇంటర్వ్యూలో ఓపెన్ ఏఐ కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న తీరును వివరించారు. ఆ తర్వాత ఓపెన్ ఏఐ కంపెనీపై అనేక మంది దావాలు వేశారు.

విందు వివాదంలో హిమాచల్ సీఎం

- అధికారిక డిన్నర్‌లో అడవి కోడి వంటకాల వడ్డింపు
- దాన్ని చంపడం నేరమన్న వన్యప్రాణి ఉద్యమకారులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సుఖు వివాదంలో చిక్కుకున్నారు. సిమ్లాలో ఆయన పాల్గొన్న ఒక విందులో జంతు రక్షణా చట్టం పరిధిలో ఉన్న అడవి కోడిని వండి వడ్డించినట్లు ఆరోపణలు వచ్చాయి. వంటల జాబితాలో అడవి కోడి మాంసం ఉన్నట్లు జంతు సంక్షేమ సంస్థ ఒకటి షేర్ చేసిన వీడియోలో వెల్లడి కావడంతో ఈ వివాదం వెలుగు చూసింది. ఈ ఘటనపై జంతు ప్రేమికులతోపాటు బీజేపీ నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. సిమ్లాకు చెందిన ఒక మారుమూల ప్రదేశంలో నిర్వహించిన ఈ అధికారిక విందులో అడవి కోడి వంటకాలను సుఖు ముట్టనప్పటికీ రాష్ట్ర ఆరోగ్య మంత్రి, మరి కొందరు అతిథులు మాత్రం దాన్ని ఆరగించినట్లు తెలుస్తోంది. వన్యప్రాణి సంరక్షణలో ఉన్న అడవి కోడిని చట్టవిరుద్ధంగా ఎలా వేటాడుతారని జంతు హక్కుల ఉద్యమకారులు ప్రశ్నిస్తున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌తోపాటు సముద్ర మట్టానికి 3,000 అడుగుల పైన ఉండే ఎత్తైన ప్రదేశాలలో మాత్రమే పెరిగే అడవి కోడిని వేటాడటం శిక్షార్హమైన నేరం.

ఈడీ అధికారులపై క్రూయిజ్ సిబ్బంది దాడి

గోవా, డిసెంబర్ 14: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బృందంపై గోవాలో దాడి జరిగింది. ఆఫ్‌షోర్ కేసినో నౌక సిబ్బంది వారిపై దాడి చేసినట్లు గోవా పోలీసులు శనివారం తెలిపారు. మనీ లాండరింగ్ కేసులో క్రూయిజ్ కేసినో షిప్‌పై గురువారం దాడి చేసిన ఈడీ అధికారులు ఒక గదిలో తనిఖీలు జరుపుతుండగా, నౌక సిబ్బంది ఆధారాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించారని పోలీసులు వెల్లడించారు. అంతే కాకుండా ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ పోలూరి చెన్న కేశవరావు, అతని బృందంపై దాడి చేశారని చెప్పారు. దీంతో కేసు నమోదు చేసిన గోవా పోలీసులు కేసినో డైరెక్టర్‌తో పాటు పలువురు సిబ్బందిపై కేసు నమోదు చేశారు.

పారాసిటమాల్‌తో వృద్ధుల గుండె, కిడ్నీలకు చేటు!

*న్యూఢిల్లీ: పారాసిటమాల్ మాత్రలను దీర్ఘకాలం వాడటం వల్ల వృద్ధుల గుండె, మూత్రపిండాలు, నోరు, పెద్ద పేగులు, చిన్న పేగులు, మలద్వారం వంటి అవయవాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. బ్రిటన్‌లోని నాటింగ్‌హామ్ విశ్వవ